# నిరుద్యోగి

రచన : శ్రీ ఎం. రామచంద్రా రెడ్డి



'హరా హుషార్! హరా హుషార్!!'

ఉష్...ఉష్...ఉష్...ఉష్.

'అందరు ఒకసారి తప్పట్లు తట్టండి బాబు.'

తప్పట్లు మోగాయి.

'ఇది తాయత్తు...దీన్కి మహిమ మీకి చూపిస్తాం.' అరె నూరుల్లా ఇధరావ్ అన్నాడు గారడీవాడు.

'అయన మీమనిషి మేమొప్పుకోము. మాలో ఎవరైన వస్తాము' అన్నారు ప్రేక్షకులు.

'వీడు మాకి మన్సి ఐతే మీది మన్సేరాండి' అన్నాడు.

ఒకడు ముందుకు వచ్చాడు.

నీకు నాం క్యా?

యొవ్వ! నేను నాము పెట్టేలేదయ్యా!

అరె బయ్యా నీకి పేరు ఏమి?

'నాపేరా, రామయ్య.'

'ఇతను మీదిమనిషి రామయ్య చేత నే ఈ తాయత్తు మహిమ చూపిస్తాను. చూడండిబాబూ!'

రామయ్య చేతిగి తాయతుకట్టి పడుకోబెట్టి పూర్తిగా గుడ్డ కప్పివేశాడు.

ఈసారి తప్పట్లు జోరుగా తట్టండిబాబూ!

జోరుగా తప్పట్లు మోగాయి.

'ఉష్ ఉష్ ఉష్ ఉష్' ఈలవేశారు.

'ఆయనచేతిలో ఏముందో తాయతు మహిమచేత చెప్పు రామయ్య' అన్నాడు.

'రెండు నారింజపండ్లున్నవి.'

'ఆయన వాచీపేరు, ఎన్ని జ్యువెల్సో చెప్పుచూద్దాం.'

'అది సీకో, ఇరవైయొక్క జ్యువెల్సువాచి.'

'ఆ పెద్దమనిషి చీకాగ్గ ఎందుకు వున్నాడు?'

'ఆ పెద్మన్సి భార్యతో లడాయీ పెట్కొన్నాడు. ఏమిచేస్తే మార్గానికివస్తుందని ఆలోచిస్తున్నాడు.'

'చూశారాబాబు మీది మనిషే తాయిత్తుమహిమచేత అన్నివిషయాలు తెలుసుకొంటున్నాడు. అంతేకాదు. యింకా మహిమ చూపిస్తాం చూడండి.'

ఒక పుత్రకారుని పిలూ, నీమనసులో ఏమైన తలచుకొని అడుగు చూద్దాం అన్నాడు గారడివాడు.

'రామయ్య నామనసులో ఏముంది, ఆపని ఔతుందా'

'నీవు విజయలలితను పెండ్లి చేసుకోవాలనుకొన్నావు. నీకోరిక ఫలించదు' అని చెప్పాడు.

ప్రేక్షకులు ఫక్కున నవ్వారు.

రామయ్యకు గుడ్డతీసి పంపించి దీనిమహిమ యింకా వుంది చెబుతాను. అయితే మీకు ఒక్కమనవి చేస్తాను. పాకెట్టులో పైకం జాగతగా చూస్కోండి. మనలోనే మనకు టోపీతీసే పెద్దమనుషులుంటారు. ఏమారి పోకు. హరా హుషార్.

ఈతాయతుమహిమ యింకా యేమిటంటే 'రాత్రి పూట కలలో మోహిని గాలులువచ్చి మొగాళ్ళను ఉక్కిరిబిక్కిరిచేస్తాయి. అలాంటివారు దీన్ని కట్టుకుంటే మల్లారావు కలలు. ఇంకా ఉద్యోగాలుదొరక్క పాపం పుత్రోల్లు చాలామంది వీధులు, ఆఫీసులు సర్వే చేస్తుంటారు. యజమానులకు సలాముచేస్తే కేర్ చేయక పైగా కస్సుమంటారు. అలాంటప్పుడు ఈ తాయత్తు కట్టుకొని వారియెదుటపోతే మీకి ఐస్ అయిపోతారు. ఆతర్వాత



మేము ...

పెర్లిన్ ఎంబోస్డ్ పెళ్లి కార్డులు, మల్టీకలర్ పెళ్ళిపత్రికల డిజైన్లు, చెక్ పేపర్లు, పెర్లిన్ బోర్డు, ఇన్‌లెండ్ లెటర్ కార్డు, పెర్లిన్ కవర్సు, మరియు ఇతర రకముల నేకములు తయారించుచున్నాము.

వివరములకు

ది ప్రిమియర్ అడ్వర్‌టైసింగ్
ఫేన్ కంపెనీ.

పి. బి. నెం: 112 : : శివకాశి (S.I)




ఉద్యోగవిషయాలు వారితో మాట్లాడితే లాభం పొందుతారు' అన్నాడు.

ఉద్యోగవిషయాలు అనగానే పాపం శంకరానికి ప్రాణం లేచివచ్చింది.

డాబామీదినుండి తాయత్తు మహిమ చూస్తూనే వున్నాడు.

శంకరం రెండుసంవత్సరాలక్రితం డిగ్రీ పడేసుకొన్నాడు. 'ఆర్' విటమిను, 'ఎమ్' విటమినులేక నిరుద్యోగిలో ఒక్కరిగా జమ చేయబడ్డాడు.

ప్రస్తుతము డాబామీది ఆఫీసులో ఎల్.డి.సి. పోస్టుస ఖాళీలున్నాయని తెలిసివచ్చాడు. దేవుడు వరమిచ్చినా పూజారి వరమీయనట్లు ఫ్యూన్ పుల్లయ్య, అయ్యగారేదో లెక్కలు చూసుకొంటుందురు కొంతసేపు ఆగండి' అన్నాడు.

ఒకసారి దృష్టిని అలా సంతవైపు మరలించాడు.

'ఎందరో బ్రతుక నేర్చినవారు'

'ఎన్నోవిధాలుగా బ్రతుకుతున్నవారు'

'బ్రతుకు తెరువు లేని నిర్భాగ్యులు'

రకరకాలమనుషులతో కోలాహలంగా వుంది సంత.

'తాను ఒక తాయత్తు తీసుకొంటే ఉద్యోగవిషయములో కొంతలాభం కల్గునేమో! అయినా దానివెల ఎంతో ఏమో అనుకొన్నాడు శంకరం.'

'ఇంతమహిమగల తాయుతు ఎవరికి కావాలి. ఉచితముగా యిస్తాను' అన్నాడు గారడీవాడు.

'నాకు కావాలి, నాక్కావాలి ఎన్నోకంఠాలు ఒకసారిగా పెగిలాయి.'

'నేనువెళ్ళి తీసుకొంటే' అనుకొన్నాడు శంకరం.

'చూశారా ఉచితమని యింతమంది అడిగితే నే నెవరికిచ్చేది. దీనీక్కి వెల రెండురూపాయలు తీసుకోండి.'

కొంతమంది చల్లబడ్డారు. కొందరు డబ్బుయిచ్చి తాయత్తు తీసుకొంటున్నారు.

శంకరం మనసు బాధతో కలికింది. వీరే కాబోలు బ్రతుకనేర్చినవాళ్లు అనుకున్నాడు.

ఆఫీసులో నవ్వులు వినబడ్డాయి. శంకరం కొంచెం తేరుకొని ప్రక్కగా కిటికిలోంచి చూచి త్రుళ్లిపడ్డాడు.

మేనేజరుగారు 'శృంగారపత్రిక' అట్టమీదగల చిత్రము లేడీ టైపిస్టుకు చూపించాడు.

'ఇలా యివ్వండి' అని అందుకొని 'ఈచిత్రం బాగుంది' అన్నది.

'అందుకె మీరీ మోడల్ జాకెటు వేసుకొంటే బాగుంటుంది' అన్నారు మేనేజరు.

'ఊఁ... ట్రై చేస్తాం' అంది లేడీ టైపిస్టు.

మిగిలిన ఉద్యోగులు ఒకరినొకరు చూచుకొని సన్నగ నవ్వుకొన్నారు.

శంకరానికి ఆశ్చర్యమేసింది.

ఓగంటక్రితం ఆ బంకు అంగడిలో రెండు తోరణాలు శృంగార, సినిమాపత్రికలు, ఒకతోరణము సాహిత్య పత్రికలు చూశాడు ఇపుడు నాలుగయిదు శృంగార పత్రికలుమాత్రము సగర్వముగా నవ్వుతున్నాయి. సాహిత్యపత్రికలు నాలుగయిదు ఖర్చయి మిగత తోరణమంతా బికబిక్కుమంటూంది.

ఇంతలో నల్గురు పోకిలాలు చెట్టాపట్టా లేసుకొంటూ వచ్చి ఫోజుగా సిగరెట్లు వెలిగించారు వారు పోటీలుపడి ఒక్కొక్కరు ఒకరకమైన శృంగారపత్రికలు పట్టుకెళ్ళారు. పాపం, సాహిత్యపత్రిక అట్టమీద వారికి కావలసిన చిత్రాలేముంటాయి. అసలు మేటరుగూడా అంతగా రుచించదుకాబోలు. యే చిత్రకారుడో గీచిన ప్రకృతిదృశ్యమో, మరే యితరచిత్రములుతప్ప. అయినా ఈమధ్య పాపం, సాహిత్యపత్రికలుకూడ సినిమా యాక్టర్ల ఫిగర్లను అచ్చు గుద్దుకుంటున్నాయి. ఇందుకే సుమా!' అనుకొన్నాడు శంకరం.

సంతలో జనం యెక్కువచేరారు. ఎన్నోరకాల వస్తువులు, వింతమనుషులు, విచిత్రసంఘటనలు, అర్థముకాని భాషలు, వివిధరకాల జీవనోపాధి, డబ్బు ధారపోసేవారు, డబ్బు సంపాదించేవారు.

ఒక పల్లెటూరి ఆవిడ 'టెరిలిన్'పై మోజుపడి కామోసు జాకెట్టు వేసుకొంది. కొట్టేచ్చే ఆమె సౌందర్యాన్ని వైట్ ఫాంటు ఆసామి పదేపదేచూచి తప్పుకొన్నాడు. తక్కినవారు సరేసరి.

కళ్లజోడెట్టుకొని చేతిలో గొడుగుపట్టుకొని సాజూకునంత నడుములో వుంచుకొనివస్తున్న ఓ యిరువదియైదేళ్ళ యువతిని సినిమా వాల్ పోస్టులు చూసుకొంటూవచ్చిన పల్లెటూరి ఆసామి ఢీకొన్నాడు.

యువతి అబ్బ! ఏంమనుషులు అని పమిట సర్దుకొని చటుగున వెళ్ళింది.

ఒకవైపు నాగరికత దాడిచేస్తోంది. ఆ నాగరికత ముసుగులోంచి అర్ధనగ్నము తాండవిస్తోంది. మరొకవైపు అజ్ఞానం అలముకొంటున్నది. మానవుణ్ణి వింతజంతువు చేస్తూంది.

'జీవితము యెంత విచిత్రమైనది. వెలుగునీడలు, పాపపుణ్యములు, సుఖదుఃఖాలు జీవితాన్ని పంచుకొంటున్నాయి. కాని కొందరిజీవితంలో ఒక్కొకభాగమే యెక్కువ కనబడుతుంటాయి. నేడు నాయకులు ఓట్లు సంపాదించి ముందుకొచ్చినట్లే అవికూడ పూర్వజన్మ ఫలితాలనుబట్టి మెజారిటీ కొస్తుంటాయేమో?'

అయినా జానెడు పొట్టకోసం ఎన్నిరకాల జీవనోపాధులు. ఎన్నెన్ని పాట్లుపడడం. అంతా మాయా ప్రపంచమురా భగవాన్ అనుకొన్నాడు శంకరం.

పొంచివుండిన కుక్క తట్టలోని మురుకులను నోటికి కరచుకొని గుంపులో దూరింది. మురుకుల ఆసామి కర్రదీసుకొని లేచాడు. పాపం దానిసొత్తు వదిలేయవయ్యా... కొట్టితేమాత్రం వస్తుందా, మనుషులే యీరోజుల్లో తిండిలేక చస్తూంటే అవిమాత్రం ఏంచేస్తాయి' అని నాలుగయిదుకంఠాలు ఏకముగా పలుకగానే ఆసామి చల్లబడిపోయాడు.

'అరె కుక్కలపైనకూడా సానుభూతి చూపిస్తున్నారే, ఫరవాలేదు. నాదేశంలో యింకా కరుణ, జాలి, ప్రేమ కల్గివున్నారు. అంటే మానవత్వముంది' గర్వించాడు నిరుద్యోగి శంకరం.

'పట్టండి, కొట్టండి. దొంగవెధవ' అని ఒక టేకేకలు! జనం గుమిగూడారు. ఒక చిన్నరౌడీవాలా పిక్ పాకెట్ కొట్టాడట. దొరికిపోయాడు. పోలీసు లాక్కెళ్లాడు.

'దొంగ వెధవలు వల్లువంచి పనిచేయలేక ఇదొకవృత్తి అయిపోయింది' బిగ్గరగా గొణుకుతూ పోతున్నాడు ఒక పెద్దాయన.

శంకరం ఈసారి తీవ్రముగా ఆలోచించాడు. కుక్కపైనమాత్రము జాలిచూపించారె, ఈరౌడీని లాక్కెళ్లారె. పని చేయలేదంటారు. ఈరోజుల్లో పని ఎక్కడ దొరుకుతూంది. డిగ్రీలు పుచ్చుకొన్నవాళ్ళకే ఉద్యోగం లేనపుడు మరి యిలాంటివారి కెక్కడ దొరుకుతుంది. ఏదో వీళ్లు అంటూనేవున్నారు వాళ్లు చేస్తూనేవున్నారు. షరా-మామూలు. అయినా న్యాయాన్ని ధర్మాన్ని ఈ రామరాజ్యములో నాల్గుపాదములా కాపాడుతున్నాన్నరమాట.

'మముగన్న తల్లులార నారాయణ
దయగనుము తండ్రులార నారాయణ
బిడ్డపాపలు లేరు నారాయణ
ధర్మము చేయండి నారాయణ'

ఒకడు గొంతు చించుకొంటూంటే ముగ్గురు వంత పాడుతున్నారు. అందరూ వికలాంగులే. ప్రాణం పోయేలా తమబాధను దీనాతిదీనముతో వెల్లగక్కుతున్నారు. మనసు కరిగినవాళ్లు చిల్లరపడేసి పోతున్నారు.

ఆఫీసులో గడియారం పదకొండుగంటలు కొట్టింది. కొద్దిసేపట్లో స్కూలుపిల్లలు వచ్చారు. మిఠాయి అంగడి ముసెమ్మ గొంతు పెద్దదిచేసి గంట మోగించింది.

'ఇది బొంబాయి మిఠాయి. చిన్నవాళ్లుతింటే పెద్దవాళ్ళు అయ్యేమిఠాయి. ముసలివాళ్లుతింటే యువకులయ్యేమిఠాయి.'

'గణగణ గణగణ' గంట మోగుతూంది.

పైసలున్నపిల్లలు మిఠాయితీసుకొని చప్పరించుకొంటూ వెళుతున్నారు.

మేనేజరుగారి కుమారుడు మెటికలెక్కి సరాసరి ఆఫీసులో కెళ్ళాడు.

'అరె బాబూ! వచ్చేశావట్రా' ఎత్తుకొని ముద్దాడాడు.

'డాడీ! ఈ పుస్తకమివ్వు బొమ్మలు చూపిస్తా'

'అమ్మదొంగ ఈపుస్తకము కావాలట్రా, ఇలాంటివి ఈవయసులో చూడకూడదు. చదువకూడదు. నువ్వుకూడ పెద్దవాడై బాగా చదువుకొని ఆఫీసరయితే అపుడు చదువవచ్చు' అన్నాడు మేనేజరుగారు శృంగారపత్రిక పేజీలు త్రిప్పుతూ.

ఔను, నాయకుల సంతతి నాయకుడు ఆఫీసరుకొడుకు ఆఫీసరు. ప్యూన్ పుత్రుడు ప్యూన్. వ్యవసాయదారుని కుమారుడు వ్యవసాయదారుడు. నిరుద్యోగి కుమారుడు నిరుద్యోగి. అలాగే నటుల సంతతి. వారివారి వంశపారంపర్యాలు వారికే అన్వయించాలి. అన్వయిస్తుందికూడానేమో. మా తాత నిరుద్యోగి. మా నాన్న నిరుద్యోగి. ఇంక నాకుమాత్రము ఉద్యోగ మెందుకువస్తుంది? ఎవరిస్తారు? శంకరం అంతరంగం తర్కించింది.

కాలింగ్ బెల్ మ్రోగింది.

'అయ్యా! అంటూ రామయ్య ప్రవేశించాడు.'

'బాబు కేమికావాలో కొనిపెట్టి యింటిదగ్గర వదిలేసిరా' అని చిల్లరడబ్బులు పడేశాడు మేనేజరుగారు.

హమ్మయ్యా! ప్యూన్ గ్రహం తొలిగింది. దేవునికి మనసులో కృతజ్ఞత తెలుపుకొన్నాడు.

'నమస్కారము సార్' వినయవిధేయతలతో నిల శంకరం.

ప్రతినమస్కారమునకు చిహ్నముగ పైళ్ళలోంచి తల పైకెత్తాడు మేనేజరు. ఆచూపుల్లో ఏమిటని ప్రశ్నార్థకము ద్యోతకమవుతుంది.

'నా పేరు శంకరంసార్. ఇక్కడ ఎల్. డి. సి. పోస్టు ఖాళీగా వున్నాయని, ఆ వివరాలు పేపర్లో చూచి..' అన్నాడు శంకరం.

ఓ, ఆవిషయమా! అవి ఈవరకే ఫిలప్ ఐపోయాయి' అన్నాడు నిర్లక్ష్యముగా మేనేజరు.

శంకరం హృదయం బాధతో దహించుకుపోయింది. నీరసము వాపేసుకొంది. సత్తువ సన్నగిల్లింది. ఏమి మాటాడాలో, ఎలా పెదవి విప్పాలో శంకరానికి అగమ్యగోచరమయింది.

ఆఫీసులోనుండి బయటపడ్డాడు. ఇంతసేపు ఆకలి తెలియలేదు. నీరసమున్నా అగుపించలేదు. ఏదో శుభవార్త తెలుస్తుందని ఓపికతో వున్నాడు. ప్రతిఫలం శూన్యమైంది.

ఆఫీసు సోపానములు అవరోహిస్తూ అప్రయత్నంగా చేయి ఫాంటుజేబులోకి పోయింది. పదిపైసల నాణెము దొరికింది. ఏమిచేయాలో అర్థముకాలేదు. ఈ పదిపైసలతో ఎలా కడుపు నింపుకొనేదో? ఏమిటో?

సంతలోకెళ్ళి ఒక రౌండువేశాడు. ఓమూల ఫరంగిబేడలు ఆకర్షించాయి. ఈగలు వాటిలోనిమాధుర్యాన్ని చవిచూస్తున్నాయి. చిన్నప్పుడు చదివిన ఆరోగ్యసూత్రములు తళుక్కున స్ఫురించాయి. ఆరోగ్యసూత్రాలను ఆచరణములో పెట్టడమా? ఆబేడలను ఆహారముగా తీసుకోవడమా?

బేరమాడి ఒక బేడ తీసుకొన్నాడు. కాస్త చల్లబరచుకొని సంతవదలి మెయిన్‌రోడ్డుమీదికి వచ్చాడు. అలా ఆలోచనల్లో మునిగిపోతూ పార్కు చేరుకున్నాడు.

మున్సిపాలిటివారి ధర్మమా అని కొళాయిలోని నీళ్ళతో కడుపునింపుకొని ఓమూల సిమెంటు పలకమీద జేరగిలబడ్డాడు.

'నమస్కారంసార్' అనగానే శంకరం ఉలిక్కిపడ్డాడు. నాకెవరబ్బా నమస్కారము చేసేది.

ప్రతినమస్కారముచేసి ఎదుటివ్యక్తిని ఏమిటి అని అన్నాడు.

'భోజనము చేసి మూడురోజులైందిసార్. ఇక్కడ తెలిసినతను ఉద్యోగమిప్పిస్తా రమ్మన్నాడు. తీరా వచ్చేలోగా పారమురోజు క్రితం ట్రాన్స్‌ఫర్ అయ్యాడట. ఉన్నడబ్బు అయిపోయింది. ఏమైనా సహాయంచేయండి' అని ఎదుటవ్యక్తి చెప్పుకుపోతున్నాడు.

శంకరం హృదయాన్ని ఈటెలతో, బరిసెలతో పొడిచినట్లయింది. కన్నీళ్లు ఆవిరై పోయాయి. మాటలు రాక తడబడుతూ పెదవులువిప్పాడు.